సాక్షి కర్నూలు

సోమవారం । 22 । జనవరి । 2024



వైభవంగా పార్వేటోత్సవం

ఆళ్లగడ్డ: పార్వేట మహోత్సవాల్లో భాగంగా అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ ఆదివారం కోటకందుకూరుకు చేరుకోవడంతో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



కాబోయే అమ్మకు అభయం

గర్భిణులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రక్తహీనత నివారణకు పోషకాహారాన్ని అందిస్తోంది. ఉచితంగా మందులు ఇస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ముగిసిన సంక్రాంతి సెలవులు

- నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

కర్నూలు సిటీ: అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు ఈ నెల 9 నుంచి ఇచ్చిన సంక్రాంతి సెలవులు 18వ తేదీతో ముగిశాయి. అయితే సెలవులను రెండు రోజులు పెంచగా, ఆ సెలవులు సైతం ముగియడంతో నేటి(సోమవారం)నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. పునఃప్రారంభం రోజున జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు అందించే చిక్కీలు, కోడి గుడ్లు సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

తుది ఓటరు జాబితా విడుదలకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024కు సంబంధించి తుది ఓటరు జాబితాను సోమవారం విడుదల చేసేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తుది ఓటరు జాబితా చేర్పుల్లో యువ ఓటర్ల నుంచి అనూహ్య స్పందన లభించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు గతేడాది అక్టోబర్ 27న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై జనవరి 9వతేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి తుదిఓటరు జాబితా రూపకల్పన చేశారు.

కర్నూలు మార్కెట్ యార్డుకు నేడు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం సెలవు ప్రకటించారు. అయోధ్యలో అత్యద్భుతంగా నిర్మించిన ఆలయంలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో కమీషన్ ఏజెంట్లు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కమీషన్ ఏజెంట్ల వినతి మేరకు మార్కెట్ కమిటీ సోమవారం యార్డుకు సెలవు ప్రకటించింది. రైతులు సోమవారం మార్కెట్‌కు ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావద్దని మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు నాలుగు బృందాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 252 అనిమల్ హజ్బెండరీ అసిస్టెంటు (ఏహెచ్ఏ) పోస్టుల భర్తీకి ఈ నెల 22, 23 తేదీల్లో కర్నూలు కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఏహెచ్ఏ పోస్టులకు మెరిట్ ప్రాతిపదికగా ఎంపికైన 252 మంది అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. బృందాలకు డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్లు నేతృత్వం వహిస్తారు. ప్రతి బృందంలో నలుగురు సభ్యులు ఉంటారు. ఏహెచ్ఏ పోస్టుల భర్తీకి ప్రభుత్వం 12 రకాల విద్యార్హతలను నిర్ణయించింది. విద్యార్హతలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలపై జిల్లా యంత్రాంగం సర్టిఫికెట్లు పరిశీలించే టీమ్‌లకు అవగాహన కల్పించింది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఈ నెల 24, 25 తేదీల్లో నియమాక పత్రాలు అందజేస్తారు. ఫిబ్రవరి1 తర్వాత పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది.

శిఖరేశ్వరం ఆలయం అభివృద్ధికి చర్యలు



శిఖరేశ్వరం వద్ద అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శిఖరేశ్వరం ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టవలసిందిగా దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆలయ శిఖరేశ్వర ఆలయం, అక్కడ గల పుష్కరిణి, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. శిఖరేశ్వర ఆలయ మెట్ల మార్గానికి, పాకశాలకు తగు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈఈ వి.రామకృష్ణ, జి.మురళీధర్‌రెడ్డి, సహాయ కార్యనిర్వాహణాధికారి బి.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.





కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయోధ్య నమూనా ఆలయం

శ్రీరాముడు.. హిందువుల ఆరాధ్య దేవుడు.. ఊరూరా కొలువై పూజలందుకుంటున్నాడు. జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం వైభవంగా సాగనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నీలమేఘశ్యామున్ని స్మరించుకోనున్నారు. దశరథ తనయుడి ఉత్సవ విగ్రహాలను వీధివీధినా ఊరేగించనున్నారు. భక్తజన ప్రియ సీతారాముడికి కనుల పండువగా శోభాయాత్రలు జరపనున్నారు. అయోధ్య ఉత్సవాన్ని తిలకించడానికి పలుచోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కళాకారులు రామాయణ గాథను వినిపించనున్నారు. సుగుణ సంపన్నుడి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు.

భక్తజన ప్రియ సీతారాం



నంద్యాల: ప్రత్యేక అలంకారంలో సంజీవనగర్ కోదండ రాముల వారు

- నేడు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట నేపథ్యంలో ప్రత్యేక పూజలు
- కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయోధ్య నమూనా ఆలయం
- రాముల వారి విగ్రహాలతో శోభాయాత్ర
- సీతారాముల కల్యాణం నిర్వహణకు చర్యలు
- అయోధ్య కేసు వాదనల వ్యయాలను భరించిన జి.పుల్లారెడ్డి



కర్నూలులో కార్యక్రమ వీక్షణ కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు



స్వాగత తోరణాలు

కర్నూలు(సెంట్రల్)/నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో ఏ నోటా విన్నా రామనామం వినిపిస్తోంది. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం పూర్తి కావడం.. బాలరాముడి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం జరుగుతుండటంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ఆలయాల్లో శ్రీరామచంద్ర ప్రభువు, సీతమ్మ అమ్మవారికి పట్టాభిషేక మహోత్సవాలు, శోభాయాత్రలు, కల్యాణోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కర్నూలులో నమూనా ఆలయం

కర్నూలులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయోధ్య రామాలయాన్ని పోలిన నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశారు. అయోధ్యలో బాల రాముడికి పూజలు జరిగే విధానంలో ఇక్కడ కూడా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సీతారాముల శోభాయాత్ర, పట్టాభిషేక మహోత్సవం, వివాహ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సీతారాముల వారి కల్యాణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడి నుంచే శ్రీరాముల వారి విగ్రహంతో శోభాయాత్ర ప్రారంభమై నగరంలోని వీధుల గుండా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంటుంది. శోభాయాత్రలో సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసే విధంగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్రకు జ్యోతులతో స్వాగతం పలుకుతారు. అనంతరం 22 నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో 108 కలశాలతో శ్రీరాముని పాదుకలకు అభిషేకాన్ని భక్తులు చేసేలా ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు విజయవాడ అష్టాక్షరీ పీఠాధిపతులు శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామిచే ధార్మిక ప్రవచనం, ఉపన్యాసాలు ఉంటాయి. రాత్రి 7.30 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయి. రామాయణంలోని ఘట్టాలను వివరించే ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ పురాణ పండితులు పౌరాణిక శిరోమణి వి.రామకృష్ణ శేషసాయి వక్తగా, వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు.

అయోధ్యతో జి.పుల్లారెడ్డికి అవినాభావ సంబంధం

అయోధ్య రామాలయానికి కర్నూలుకు అవినాభావ సంబంధం ఉంది. అయోధ్య కేసును వాదించేందుకు అయ్యే వ్యయాన్ని జిల్లాకు చెందిన ప్రముఖ నేతి మిఠాయిల దుకాణం నిర్వాహకులు జి.పుల్లారెడ్డి భరించారు. ఈయన వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు, కోశాధికారిగా ఒకసారి బాధ్యతలు నిర్వర్తించారు. కర్నూలులో చేపట్టే ఉత్సవాలను జి.పుల్లారెడ్డికి అంకితం చేస్తున్నట్లు ఇప్పటికే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ప్రకటించింది. అదేవిధంగా కర్నూలు సంఘ్ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించిన వై.రాఘవులు, కోటేశ్వరరావులు ప్రస్తుతం అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నారు. వీరు గతంలో కర్నూలులో సంఘ్ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

అయోధ్యలోని బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట దృశ్యాలను భక్తులు నేరుగా వీక్షించడానికి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నాలుగు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, మంచినీరు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు నిర్వాహక కమిటీ చర్యలు తీసుకుంది.

ప్రత్యేక పూజలు

అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని కర్నూలులోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు సీత, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామివారి విగ్రహాలకు 108 కలశాలతో వేద మంత్రోచ్చారణలతో సుగంధ ద్రవ్య జలాభిషేకం, పుష్పార్చన, శ్రీరామ నామ సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వీక్షించేందుకు ఆలయంలో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



నంద్యాలలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాలలో..

నంద్యాల పట్టణంలో సంజీవనగర్ రామాలయం, ఎస్‌బీఐ రామాలయం, కోదండ రామాలయం పాటు అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పలుచోట్ల చెక్కభజనలు, కోలాటాలు వేయనున్నారు. సీతారామ లక్ష్మణ, హనుమంతుల వేషధారణలతో అలంరించనున్నారు. ఇప్పటికే విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, పలు ధార్మిక సంస్థల నాయకులు ఇంటింటికీ తిరిగి కాషాయ జెండాలు, క్యాలెండర్లు, దీపాలను ఉచితంగా పంపిణీ చేశారు. అయోధ్యలో జరిగే పూజా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు నంద్యాల పట్టణంలోని ప్రథమనంది, నాగులకుంట శివాలయం, సంజీవనగర్ రామాలయం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం, కల్పనా సెంటర్ రామాలయం, పలు సెంటర్లలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదాల పంపిణీ చేయనున్నారు.

కర సేవకుల సేవలకు సన్మానం

అయోధ్య రామమందిరం కోసం 1990, 92 సంవత్సరంలో పోలీసుల దెబ్బలకు, తూటాలకు భయపడకుండా పోరాడిన 41 మంది కరసేవకులను ఆదివారం ధార్మిక సంఘాల సభ్యులు నంద్యాలలో ఘనంగా సత్కరించారు. వారు తమ అనుభవాలను భక్తులతో పంచుకున్నారు.

జన్మ ధన్యమైంది



1992లో అయోధ్యకు వెళ్లాను. నెల రోజుల పాటు మందిరానికి వెలుపల, టెంట్లలో ఉన్నా. పోలీసులు లాఠీలతో కొడుతున్నా తప్పించుకొని తిరిగా. అల్లర్లు జరగడంతో పోలీసుల నుంచి తప్పించుకొని నంద్యాలకు చేరుకున్నా. అయోధ్య ఆలయ నిర్మాణంతో మా సంకల్పం నెరవేరింది. నా జన్మ ధన్యమైంది.

–సూత్రాయి నాగరాజరావు, కరసేవకుడు, నంద్యాల

ఆ పోరాటం మరువలేను



నంద్యాల నుంచి 1992లో 41మంది కరసేవకులం అయోధ్యకు వెళ్లాం. మాలో చాలా మందికి పోలీసుల లాఠీ దెబ్బలు తగిలాయి. తలకు గాయాలయ్యాయి. అయినా మేం పట్టువీడ లేదు. రామ మందిర నిర్మాణానికి పోరాటం చేశాం. చాలా ఇబ్బందుల పాలయ్యాం. ఆ పోరాటాన్ని నేను జీవితంలో మరిచిపోలేను.

–మేడా రామేశ్వరప్రసాద్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు, నంద్యాల

శాశ్వత అభివృద్ధితో చెరగని ముద్ర

- 50 ఏళ్లలో చేయలేనిది ఐదేళ్లలో చేసి చూపించాం
- అభివృద్ధిపై మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదు
- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మంత్రికి కంబళి, గొర్రెపిల్లను బహూకరించిన యాదవులు



సభకు హాజరైన జనం

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలో దాదాపు రూ. 2,700 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తూ నియోజకవర్గ చరిత్రలో చెరగని ముద్ర వేశామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో రూ. 18.77 కోట్లతో నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, బాలుర, బాలికల వసతి గృహాలు, గొర్రెల పెంపకం దారుల శిక్షణ కేంద్రం తదితర భవనాలను ఎమ్మెల్సీ ఇషాక్ అహ్మద్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులతో కలసి ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. 50 ఏళ్లలో డోన్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నాయకులు చేయలేని అభివృద్ధిని తాము ఐదేళ్లలో చేసి చూపించామన్నారు. ఐదేళ్లకోసారి ఎన్నికల ముందు కంబగిరి స్వామి ఆశీస్సులు తీసుకునేందుకు వెళ్లే నాయకులు కనీసం ఆ దేవాలయానికి రోడ్డు సౌకర్యం కల్పించలేకపోయారని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి డోన్ నియోజకవర్గం పట్ల ఉన్న ప్రేమతో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తనకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని తెలిపారు. ప్యాపిలి మండలంలో మారుమూల గ్రామమైన వంకమెట్టుపల్లికి సైతం ఇంటింటికి తాగునీరు ఇవ్వడమే తన ధ్యేయం అన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తే విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని భావించి హుసేనాపురంలో వెటర్నరి పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. పశుసంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కాకపోవడానికి కారణం వెటర్నరీ విభాగంలో ఉన్నత చదువులు స్థానికంగా అందుబాటులో లేవని తాను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ కారణం చేతనే హుసేనాపురంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశానని తెలిపారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన వెంటనే సచివాలయాల్లో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో గొర్రెల పెంపకం ద్వారా సంపద సృష్టించుకున్న గొర్రెల పెంపకందార్లు ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని మంత్రి తెలిపారు. వారికి సరైన శిక్షణ ఇచ్చి గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా మార్చాలన్న ఉద్దేశంతో షెప్పర్డ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి గొర్రెల పెంపకందార్లకు ఈ శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు.

హామీలతో మభ్య పెడతారు జాగ్రత్త..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారానికి వచ్చి ఉచిత హామీలు గుప్పిస్తారని ఎమ్మెల్సీ ఇషాక్ అహ్మద్ విమర్శించారు. మహిళలకు కిలో బంగారం, ఇంటికో కారు కూడా ఇస్తామని హామీ ఇస్తారని..అటువంటి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే విషయంపై స్పష్టమైన అవగాహన ఉన్న దూరదృష్టి గల వ్యక్తి ఇక్కడ ఎమ్మెల్యే ఉండటం డోన్ ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు.

డోన్ అందరికీ ఆదర్శం

డోన్ నియోజకవర్గ అభివృద్ధి అందరికీ ఆదర్శమని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారు డోన్ నియోజకవర్గాన్ని చూసి అభివృద్ధి విషయంలో మంత్రిని ఆదర్శంగా తీసుకుంటారని తెలిపారు. తాను కొద్ది రోజులుగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెంట పర్యటిస్తూ అభివృద్ధి కార్యాక్రమాలు చూస్తేంటే మంత్రి చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, శ్రీవేంకటేశ్వర వెటర్నరి యూనివర్సిటి డీన్ వీరబ్రహ్మయ్య, రిజిస్ట్రార్ రవి, డైరీ డీన్ సురేశ్, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమేంద్రకుమార్, ఏడీ సింహాచలం, నోడల్ ఆఫీసర్ లావణ్యలక్ష్మి, జేడీ రామచంద్రయ్య, డీఏహెచ్ఓ గోవిందనాయక్, డీడీలు శాంతయ్య, రామమూర్తి, ప్రిన్సిపాల్ మాధవి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, హుసేనాపురం, కొమ్మెమర్రి సర్పంచులు మహేశ్వర్ రెడ్డి, దస్తగిరమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ శ్యాంరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

- తుది ఓటరు జాబితా ప్రకటన తరువాత దరఖాస్తులు స్వీకరించాలి
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి
- ఓటరు జాబితా పరిశీలకుడు డి. మురలీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకుడు డి.మురళీధర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా తుది ఓటరు జాబితా ప్రకటన తరువాత దరఖాస్తులు స్వీకరించాలని ఓటరు జాబితా పరిశీలకుడు, ఏపీఎంఎస్ఐడీసీ వైస్ చైర్మన్, ఎండీ డి.మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటరు తుది జాబితా ప్రచురణపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఆయన సమీక్షించారు. ముందుగా ఓటర్ల వివరాలు, రాజకీయపార్టీల ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సోమవారం ఓటరు తుది జాబితాను ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రచురణ జరగాలని, ఆ వెంటనే రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించి రెండు సెట్ల జాబితాలను అందజేయాలన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు అభ్యంతరాలపై డాక్యుమెంట్‌ను తయారు చేసినట్లు చెప్పారు. తుది ఓటరు జాబితాను ప్రచురించినప్పటికీ అర్హులై మిగిలి ఉన్న ఓటర్లకు తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్‌లు ఉన్న అర్బన్, రూరల్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు సూచించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ..తుది ఓటరు జాబితా ప్రకటనకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను నిష్పక్షపాతంగా పరిశీలించామని, ప్రతి దరఖాస్తుకు డాక్యుమెంట్లను జతచేసినట్లు చెప్పారు. కాగా, జిల్లా పర్యటనకు వచ్చిన ఓటరు జాబితా పరిశీలకుడు డి.మురళీధర్‌రెడ్డికి డీఆర్వో కె.మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆసరా నిధుల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాలకు 4వ ఏడాదికి సంబంధించి వైఎస్ఆర్ ఆసరా నిధులు ఈ నెల 23న విడుదల కానున్నాయి. రాష్ట్ర స్థాయిలో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. కర్నూలు జిల్లాలో 25,705 స్వయం సహాయక సంఘాలకు రూ.142.36 కోట్లు విడుదల అవుతాయి. 2,49,976 మంది మహిళలు లబ్ధిపొందనున్నారు. ఈనెల 24 నుంచి 31 వరకు ఆసరా సంబరాల్లో భాగంగా షెడ్యూలు ప్రకారం నిధులు సంఘాల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

క్లుప్తంగా

మల్లన్న సేవలో తెలంగాణ మంత్రి



మంత్రి దామోదర్ రాజనరసింహకు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనరసింహ ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాను అందజేశారు.

మాజీ సైనికుల భూములకు ఎన్ఓసీ ఇప్పించాలి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మాజీ సైనికులకు పది సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూములకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) ఇవ్వాలని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్యచౌదరి కోరారు. ఆదివారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ సైనికులకు ఇచ్చిన భూములకు సంబంధించి ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు పరిశీలించి ఎన్ఓసీ ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. రీ సర్వే పేరుతో మాజీ సైనికులకు ఇచ్చిన భూములను హోల్డ్‌లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలోని అనేక మంది మాజీ సైనికులకు నేటికి ఇళ్ల స్థలాలు లేవని, జిల్లా సైనిక్ బోర్డు పంపిన జాబితా మేరకు అన్ని మండలాల్లో మాజీ సైనికుల కుటుంబాలకు రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు.

టీబీ డ్యాంలో 10 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర డ్యాంలో ఆదివారం సాయంత్ర సమయానికి 10.120 టీఎంసీల నిరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో జీరోగా ఉంది. డ్యాంలో నీరు తక్కువగా ఉండడంతో టీబీ బోర్డు అధికారులు గత నెల 25న ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపి వేశారు. బళ్లారి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు గాను సోమవారం టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీకి నీరు వదిలే అవకాశం ఉంది.

సీఎం జగన్‌కు మద్దతిద్దాం

నంద్యాల(అర్బన్): గిరిజన ప్రాంతాలను అభివృద్ధి పరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇద్దామని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో గిరిజన సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ నడిబొడ్డున అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల తనకున్న ప్రేమను చూపారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఏ ఒక్క నామినేటెడ్ పదవి కాని, కేబినెట్‌లో మంత్రి పదవులు కాని ఇవ్వలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గిరిజనులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌నాయక్, నాగేంద్రనాయక్, గుండూనాయక్, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాబోయే అమ్మకు అభయం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం
- అవసరమైతే రక్తం ఎక్కించే కార్యక్రమం
- ఉచితంగా మాత్రలు, ఇంజెక్షన్లు
- క్షేత్రస్థాయిలో ప్రభుత్వ చర్యలు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి స్త్రీ మూర్తికి మాతృత్వం ఓ వరం. గర్భం దాల్చిన వెంటనే వారి ఆనందం పట్టలేనంతగా ఉంటుంది. తమకు పండంటి బిడ్డ జన్మించాలని వారు రోజూ కలలు కంటూ ఉంటారు. కానీ వారు కలలు కంటే సరిపోదు. మంచి పోషకాహారం తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల సూచనల మేరకు మందులు, ఇంజెక్షన్లు వేయించుకోవాలి. శరీరంలో తగినంత రక్తం లేకపోతే ప్రాణాంతకం అవుతుంది. కడుపులో ఉన్న బిడ్డతో పాటు తల్లికీ అపాయం ఏర్పడుతుంది. పోషకాహారంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ సమస్య వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు గర్భిణిలకు ఉచితంగా మందులు, ఇంజెక్షన్లు, పోషకాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నంద్యాల జిల్లా ఆసుపత్రి, ఆదోని మాతాశిశు ఆసుపత్రికి ప్రతి నెలా ప్రాణాపాయ స్థితిలో రక్తహీనత ఉన్న గర్భవతుల కేసులు 10 నుంచి 25 దాకా వస్తుంటాయి. కర్నూలులో సగటున ప్రతిరోజూ హెచ్‌బీ 5 గ్రాములు కంటే తక్కువ రక్తంతో ఆసుపత్రికి వస్తుంటారు. జిల్లాలో మాతాశిశు మరణాలు తగ్గించేందుకు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగం

గాను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ మేరకు ఆశాల నుంచి వైద్యాధికారి వరకు గర్భం దాల్చిన మహిళ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాధారణ రక్తహీనత ఉన్న వారికి మాత్రలు, తీవ్ర రక్తహీనత ఉన్న వారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు.

55 శాతం మందికి తీవ్ర రక్తహీనత

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ ఓపీకి ప్రతిరోజూ గర్భిణులు 180 నుంచి 250 మంది చికిత్సకోసం వస్తున్నారు. వీరిలో 60 నుంచి 70 శాతం మందికి హెచ్‌బీ 10 నుంచి 6 గ్రాములులోపు ఉంటోంది. జిల్లాలో ఈ ఏడాది మొత్తం 28,416 మంది గర్భిణుల్లో 15,716 మందికి 11గ్రాములు, 997 మందికి ఏడు గ్రాముల్లోపు రక్తం ఉంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 50,038 మంది గర్భిణుల్లో 20,773 మందికి 11 గ్రాములు, 1,807 మందికి 7 గ్రాముల్లోపు రక్తం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గర్భిణులకు ఉచితంగా పోషకాహారం, మందులు

పేద గర్భిణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. వారు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంత వరకు ఎలాంటి ఖర్చు లేకుండా వైద్యచికిత్స, మందులు, పోషకాహారం అందిస్తోంది. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులచే వైద్యపరీక్షలు, వైద్యచికిత్స, ఉచితంగా మందులు ఇస్తున్నారు. రక్తం తక్కువైన వారికి మాత్రలతో పాటు తీవ్ర రక్తహీనత ఉన్న వారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు, అవసరమైన వారికి రక్తం కూడా ఎక్కిస్తున్నారు.

ఆరేళ్లుగా గర్భిణుల్లో రక్తహీనత వివరాలు

సంవత్సరం	11 హెచ్‌జీ లోపు (శాతం)	7హెచ్‌జీ లోపు(శాతం)
2018-19	71.23	2.2
2019-20	55.69	1.77
2020-21	72.44	4.64
2021-22	68.63	3.81
2022-23	41.51	3.61
2023-24	55.31	3.51

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

హిమోగ్లోబిన్ శాతం 8 నుంచి 10 గ్రాములు ఉంటే కొంచెం రక్తహీనతగా, 6 నుంచి 8 గ్రాములుంటే మధ్యస్తంగా, 6 కంటే తక్కువగా ఉంటే మాత్రం దానిని వైద్యులు తీవ్రంగా పరిగణిస్తారు. 8 నుంచి 10 శాతం ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, 6 నుంచి 8 గ్రాములు ఉన్న వారు ఐరన్ సుక్రోజ్ ఇన్‌ఫ్యూజన్ ఇంజెక్షన్లు ఇస్తారు. 6 కంటే తక్కువ ఉన్న వారికి మాత్రం రక్తం ఎక్కిస్తారు. గర్భిణికి మూడో నెల గర్భం నుంచి తప్పనిసరిగా ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలి. లేకపోతే వారు తీవ్ర రక్తహీనతకు చేరి తల్లీబిడ్డలిద్దరికీ ప్రాణాపాయం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు, ఇంజెక్షన్లు



గర్భిణి మొదటి మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆమెకు రక్తపరీక్ష నిర్వహిస్తాం. అందులో రక్తం తక్కువగా ఉంటే ఐరన్ మాత్రలు అందజేస్తాం. ఇలా ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి రక్తపరీక్షలు చేస్తాం. మాత్రలతో రక్తం పెరగకపోతే ఐరన్‌సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇస్తున్నాం. ఇదే సమయంలో వారి వివరాలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి అక్కడ వారికి మంచి పోషకాహారం అందే ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

పోషకాహారం తీసుకోవాలి



ఇటీవల కాలంలో గర్భిణుల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటోంది. పోషకాహారంపై వారికి సరైన అవగాహన లేకపోవడమే కారణం. ఈ మేరకు వారు ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషకాలు ఉండే విధంగా చూసుకోవాలి. సమతుల ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రక్తపరీక్ష చేయించుకుని రక్తం తక్కువగా ఉంటే అవసరమైన మందులు, ఇంజెక్షన్లు వాడాలి. రక్తం తక్కువగా ఉంటే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లికి ప్రమాదం పొంచి ఉంటుంది.

–డాక్టర్ జోత్స్న, గైనకాలజిస్ట్, కర్నూలు

గుప్త నిధుల కోసం తవ్వకాలు

మహానంది: అల్లీనగరం సమీపంలో అతి పురాతనమైన శివాలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. గతంలో 1902 నుంచి 1947 వరకు మహానంది ఆలయ ధర్మకర్తగా పనిచేసిన బైరవజోష్యుల మహానందయ్య ఇక్కడ గోశాల నిర్వహించేవారని, బ్రాహ్మణులు సైతం ఇక్కడ ఉండేవారని చరిత్ర చెబుతోంది. అందుకే ఈ ప్రాంతం అప్పట్లో అగ్రహారంగా వెలుగొందుతూ కాలక్రమేణా అల్లినగరంగా మారిందని చెబుతారు. ఇంతటి ప్రాశస్త్యమైన ఆలయం అప్పట్లోనే రెండు అరలుగా, ముందు మండపం, తర్వాత గర్భాలయం, అక్కడ ఈశ్వరుడు కొలువై ఉన్నాడు. దీంతో గుప్త నిధుల వేటగాళ్లు ఆలయంపై కన్నేసి అనుకున్న ప్రణాళిక ప్రకారం నైవేద్యం, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించి సుమారు ఆరు పది అడుగులకు పైగా గుంతను తీశారు. విషయం తెలుసుకున్న మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, పొలం సాగు చేస్తున్న బుక్కాపురం నాయకులు రఘురామిరెడ్డి, శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.



గుప్త నిధుల కోసం తవ్విన గుంత

ఘనంగా అల్లీపుర మహాదేవప్పతాత ఆరాధన

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని పర్వతాపురం రోడ్డులో వెలిసిన సద్గురు అల్లీపుర మహాదేవప్ప తాత వారి 35వ పుణ్య ఆరాధన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు ఆర్ఆర్‌జీ తిమ్మన్నగౌడ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి తాతకు గంగపూజ, రుద్రాభిషేకం, మహామంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విమాన గోపురాలకు కలశ స్థాపన చేశారు. ఇందులో ఐదుగురు పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. గబ్బూరుమఠం బూదిబసవ శివాచార్యమహాస్వాములు, కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధదేవరు, చవికిమఠం పీఠాధిపతి మరిరాచోటి మహాస్వామి, జి.హొసళ్లి పురవర్గ మఠం పీఠాధిపతి అజాతశంభులింగ శివాచార్య మహాస్వామి, పాల్తూరు మఠం పీఠాధిపతి చెన్నవీర శివాచార్యస్వాములు పాల్గొని విమాన గోపురాలకు కలశ స్థాపన చేశారు. అనంతరం ఆధ్యాత్మిక విషయాలపై ప్రసంగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పురవీధుల్లో రథోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా డోలు, సన్నాయిల మధ్య మహిళలు కోలాటం ఆకట్టుకుంది. ఆలయ సభ్యులు నీలి రాజశేఖర్, రాజుస్వామి, కన్నె మల్లికార్జున, కన్నె గణేష్, ఉదయ్‌కుమార్, మరియాని జగదీష, వీరశైవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం,(ఇన్‌సెట్) అల్లీపుర మహాదేవప్పతాత

విత్తన ధ్రువీకరణపై అవగాహన పెంచుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో సీడ్ సర్టిఫికేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, దీనిపై ఇన్‌పుట్ డీలర్లు అవగాహన పెంచుకోవాలని విశ్రాంత ప్రధాన విత్తన ధ్రువీకరణ అధికారి వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేరుశనగ, కందులు, శనగలు, వరి, పొద్దుతిరుగుడు తదితర పంటల్లో విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంట కోతకు వచ్చే వరకు వివిధ దశలను పరిశీలిస్తూ..చీడపీడలకు తావు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. విశ్రాంత జేడీఏ, దేశీ శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త జయచంద్ర , వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- పీఎంఎఫ్ అధ్యక్షుడు సిరాజ్ రెహమాన్

నంద్యాల(న్యూటౌన్): చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని పీస్ మెసేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజ్ రెహమాన్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అమీర్‌బాషా, ముస్లిం స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఫయాజ్ ఆధ్వర్యంలో 'ముస్లింలు విద్యారంగంలో ఎందుకు వెనుకబడి ఉన్నారు' అనే అంశంపై రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన సమావేశానికి వేలాది మంది ముస్లింలు హాజరయ్యారు. ఈ సమావేశానికి పీఎంఎఫ్ అధ్యక్షులు సిరాజ్ రెహమాన్, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరాజ్ రెహమాన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువేనని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. ప్రపంచంలో బతుకు వెళ్లదీయాలంటే చదువు ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలలకు పంపి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాల కోసం విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ ముస్లింలు కష్టపడుతూ వారి వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవ డంతో పాటు పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పాఠశాలలకు పంపాలని సూచించారు. ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కూడా ఎంతో కృషి చేస్తుందన్నారు.



సిరాజ్ రెహమాన్‌కు బొకే అందజేస్తున్న నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవి



సభకు హాజరైన ముస్లింలు

ఓపెన్ స్కూల్ విద్యార్థులు పోటీ పడి చదవాలి

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులతో పోటీ పడి చదవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి సూచించారు. ఆదివారం నగరంలోని ఓ ఓపెన్ స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఓపెన్ స్కూల్ ద్వారా చాలా మందికి చక్కగా ఉపయోగపడుతోందన్నారు. ఓపెన్ టెన్త్ పూర్తి చేసుకున్న వారు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వారి మెయిల్‌కు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాల వివరాలు వస్తుంటాయన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్ర భూషణ్ రావు, ప్రిన్సిపాళ్లు విజయ్‌కుమార్, జీవన జ్యోతి, రహమాన్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లుకు 30 ఏళ్లు

- సీమకు జీవనాడిగా మార్చిన సీఎం జగన్
- ఎమ్మెల్యే కాటసాని చొరవతో నాడు జలయజ్ఞంలో చేరిన ప్రాజెక్ట్
- వైఎస్సార్ హయాంలో 60 శాతం పనులు పూర్తి

పాణ్యం: కరువు నేలకు కృష్ణా జలాలను మళ్లించడంలో కీలకంగా మారిన గోరుకల్లు ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి 30 ఏళ్లు పూర్తయింది. గత ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును గాలికొదిలేయగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమకు జీవనాడిగా మార్చేసింది. సాగునీటి వనరులు లేని ఉమ్మడి కర్నూలు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు 1993 జనవరి 21వ తేదీన అప్పటి ప్రధాని పీవీ నరసింహరావు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు ఎక్కడా కూడా మొదలు కాలేవు. 2004లో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి పూనుకున్నారు. కాగా మొదట్లో జలయజ్ఞం జాబితాలో గోరుకల్లు ప్రాజెక్ట్ లేదు. అప్పుడు స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చొరవ తీసుకుని ఈ ప్రాజెక్ట్ ఆవశ్యకతను సీఎం వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లడంతో గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రూ.448.92 కోట్లు కేటాయించారు. వైఎస్సార్ హయాంలోనే గోరుకల్లు జలాశయం పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. సీమకు తలమానికంగా ఉన్న ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 12 టీఎంసీలు. శ్రీశైల డ్యామ్ వరద జలాలను సీమలకు తరలించాలనే ఉద్దేశంతో గాలేరు నగరి స్రవంతి (జీఎన్ఎస్ఎస్) 2004-05 ఏడాదిలో మొదటి దఫా కింద రూ.5వేల కోట్లను కేటాయించారు. ఈ క్రమంలో పోతిరెడ్డిపాడును విస్తరించి 40 వేలు క్యూసెక్కులు విడుదల ప్రణాళికలను రూపొందించారు. ఈ పనులను కూడా వైఎస్సార్ హయాంలో 70 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రస్తుతం సీమకు తాగు, సాగు నీరు అందుతున్నాయంటే వైఎస్సార్ నిర్ణయమే కారణం. గోరుకల్లు జలాశయం నుంచి గాలేరు ద్వారా 650 గ్రామాలకు తాగునీరు, 1.92 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో గాలేరు ప్రవహిస్తుంది. గతంలో గోరుకల్లు పర్యటనకు రెండు సార్లు వచ్చిన చంద్రబాబు పెండింగ్ పనులకు అరకొర నిధులు ఇచ్చి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేశారనే విమర్శలు వినిపించాయి. ఈ జలాశయానికి మొదటి ఈఈగా ఎన్. కృష్ణమూర్తి పని చేశారు.





అదనంగా రెండు గేట్లు ఏర్పాటు చేసే ఇన్‌ఫ్లో రెగ్యులేటర్

పారిశ్రామికాభివృద్ధికి ఊతమై..

ఈ జలాశయం నుంచి తాగు, సాగునీటికే కాకుండా పరిశ్రమలకు కూడా నీటిని కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం గోరుకల్లు నుంచి మహాసిమెంట్ పరిశ్రమకు పంపింగ్ చేస్తున్నారు. ఆసియాలోనే అత్యంత భారీ పరిశ్రమ అయిన గ్రీన్‌కో లో హైడల్ విద్యుత్ ఉత్పత్తికి రెండు టీఎంసీల నీటిని అందించి తద్వారా రీసైక్లింగ్ ద్వారా గోరుకల్లులోకి వదులుతున్నారు. అలాగే రూ.297 కోట్లతో గోరుకల్లు నుంచి డోన్ నియోజకవర్గానికి తాగునీరు అందించేందుకు అలాగే వాటర్‌గ్రిడ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలనే ట్రయల్‌రన్ పూర్తి చేశారు. అంతేకాక గోరుకల్లు, గోరుకల్లు తాండా మత్స్యకారులకు శాశ్వత ఉపాధిగా మారింది. ఈ గోరుకల్లుపై ప్రత్యక్షంగా పరోక్షంగా వందల మంది ఉపాధి పొందుతున్నారు.

గోరుకల్లుపై సీఎం ప్రత్యేక దృష్టి..

సీమకు తాగు, సాగు నీటిని అందించే గోరుకల్లు రిజర్వాయర్ నిర్వహణను గత ప్రభుత్వాలు పూర్తిగా గాలికొదిలేశాయి. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా 40 వేల క్యూసెక్కులు సామర్థ్యంతో కాల్వను విస్తరించడంతో పాటు గోరుకల్లు జలాశయానికి నీటిని చేర్చే గేట్ల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో రెగ్యులేటర్ 5గేట్లు ఉన్నాయి. వీటి వలన 30వేల క్యూసెక్కులు రిజర్వాయర్‌లోకి నీరు చేరుతోంది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపుగా రూ.28 కోట్లతో అదనంగా మరో రెండు గేట్లు నిర్మించేందుకు నిధులు కేటాయించారు. ఇటీవలనే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. అలాగే గోరుకల్లు నిర్వహణకు రూ.70 లక్షల వరకు కేటాయించారు. ఇటీవల కట్ట కుంగిపోవడంతో విషయాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేయించారు. గోరుకల్లు బ్యాక్ వాటర్‌ను గాలేరుకు మళ్లించే జీరో వద్ద నిర్మించిన జీరో రెగ్యులేటర్‌కు మొదటి నుంచి గేట్లు ఏర్పాటు చేయలేదు. సమస్యను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సీఎంతో చర్చించి కేవలం మూడు నెలలో జీరో రెగ్యులేటర్‌కు గేట్లు ఏర్పాటు చేసి గోరుకల్లు నీటి నిల్వకు ఎంతో కృషి చేశారు.